క్లుప్తంగా

డెప్యూటీ కమిషనర్ -1గా వెంకటలక్ష్మి బాధ్యతలు



నెహ్రూనగర్: నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ – 1గా బాధ్యతలు స్వీకరించిన వెంకటలక్ష్మి శుక్రవారం మేయర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ డెప్యూటీ కమిషనర్ స్థాయిలో శక్తివంచన లేకుండా ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు.

లాలాపేట ఎస్‌హెచ్‌ఓగా దేవ ప్రభాకర్



పట్నంబజారు: ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని లాలాపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా పి.దేవప్రభాకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2004 బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎస్‌ఐగా పని చేశారు. 2013లో సీఐగా పదోన్నతి లభించింది. యర్రగొండపాలెం, గిద్దలూరు, సింగరాయకొండతో పాటు పలు ప్రాంతాల్లో పనిచేశారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా లాలాపేట పీఎస్‌కు బదిలీ అయ్యారు.

డాక్టర్ మురళీకృష్ణకు పదోన్నతి



గుంటూరు మెడికల్: జీజీహెచ్ కార్డియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కరోడి మురళీకృష్ణకు ప్రొఫెసర్‌గా ప్రమోషన్ లభించింది. ఈ మేరకు శుక్రవారం ఆయనకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. ప్రమోషన్ ఇచ్చి ఆయన్ను విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాలకు బదిలీ చేశారు. గుంటూరు వైద్య కళాశాలలో 2000లో ఎంబీబీఎస్, 2008లో జనరల్ మెడిసిన్ పీజీ, 2012లో హైదరాబాద్ ఉస్మానియాలో కార్డియాలజీ పీజీ పూర్తి చేశారు. 2017లో గుంటూరు వైద్య కళాశాలలో కార్డియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరారు. అసోసియేట్ ప్రొఫెసర్‌గా 2022లో ప్రమోషన్ పొందారు. ప్రొఫెసర్‌గా ప్రమోషన్ పొందిన డాక్టర్ మురళీకృష్ణకు పలువురు కార్డియాలజిస్టులు అభినందనలు తెలిపారు.

నర్సింగ్ సూపరింటెండెంట్‌గా కమలకుమారి



గుంటూరు మెడికల్: జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా చలవాది కమలకుమారి శుక్రవారం విధుల్లో చేరారు. ఆమె జీజీహెచ్‌లోని ప్రభుత్వ నర్సింగ్ స్కూలులో 1981–1984లో జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీ (జీఎన్‌ఎం) కోర్సు అభ్యసించారు. 1985లో ఈపూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్‌నర్సుగా విధుల్లో చేరారు. కొంతకాలం అక్కడ పని చేశాక హెడ్ నర్సుగా 2009లో ప్రమోషన్ పొంది గుంటూరు జీజీహెచ్‌కు బదిలీ అయ్యారు. గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా జనవరి 31న ప్రమోషన్ పొందారు. ఇటీవల ప్రభుత్వం నూతనంగా నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు 30 మంది స్టాఫ్ నర్సులు, నర్సింగ్ సూపరింటెండెంట్ పోస్టులు మంజూరు చేసింది. నూతనంగా మంజూరైన నర్సింగ్ సూపరింటెండెంట్ పోస్టులో విధుల్లో చేరిన కమలకుమారిని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశాసజని, నాట్కో క్యాన్సర్ సెంటర్ కో–ఆర్డినేటర్ యడ్లపాటి అశోక్‌కుమార్, పలువురు నర్సింగ్ సిబ్బంది అభినందించారు.

పట్టాభిపురం ఎస్‌హెచ్‌ఓగా విజయచంద్ర



గుంటూరు ఈస్ట్: పట్టాభిపురం ఎస్‌హెచ్‌ఓగా ఎస్.విజయచంద్ర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2007లో ఎస్‌ఐగా చేరి, 2016లో సీఐగా పదోన్నతి పొందారు. గతంలో చిలకలూరిపేట రూరల్, సత్తెనపల్లి, గుంటూరు టౌన్ ఎస్‌బీ, రేపల్లె టౌన్‌లలో పని చేశారు. ప్రస్తుతం వీఆర్ నుంచి బదిలీపై పట్టాభిపురం ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు చేపట్టారు.

రేపు సినీ నటి పూర్ణిమకు సత్కారం

పాత గుంటూరు: రాజాగారి తోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతిని పురస్కరించుకుని ఆదివారం 'దొరకునా ఇటువంటి సేవ' పేరుతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు శ్రీ ఆలాపన కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లా వెంకటేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో విభావరి అనంతరం సినీ నటి పూర్ణిమకు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి పురస్కారం ప్రదానం చేసి సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. సంగీతాభిమానులు పాల్గొనాలని కోరారు.

జోరుగా నూరిఫాతిమా ప్రచారం

- 15వ డివిజన్‌లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం
- పాల్గొన్న ఎమ్మెల్యే ముస్తఫా
- కుమార్తెను గెలిపించాలని వినతి



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, నూరిఫాతిమా

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ఎన్నికల ప్రచారం జోరుగా నిర్వహిస్తున్నారు. 15వ డివిజన్ హుస్సేన్‌నగర్, చంద్రబాబు నాయుడు కాలనీల్లో శుక్రవారం ఆమె ప్రచారం చేశారు. నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పాలనకు అండగా నిలబడాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని కరపత్రాల ద్వారా వివరించారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లామని తెలిపారు. ఐదేళ్ల పాలనలో తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించుకుంటూ, పేద, మధ్య తరగతి వర్గాలకు అండగా నిలిచామని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని ప్రతి గడపకు చేర్చామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో తన కుమార్తె నూరిఫాతిమాను గెలిపించాలని కోరారు.

గెలుపు తథ్యం

రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు తథ్యమని తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజల మద్దతుతో నియోజకవర్గంలో విజయకేతనం ఎగురవేస్తామని తెలిపారు. శివారు కాలనీలను అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలో 95 శాతం పనులు పూర్తి చేశామని, ఎన్నికల్లోపు వందకు వంద శాతం పూర్తి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రామనబోయిన అజయ్‌యాదవ్, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

నియోజకవర్గంలో ప్రజల సమస్యల్ని పూర్తిస్థాయిలో పరిష్కరించడానికి పాటుపడతామని ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని 1వ డివిజన్ ఆర్టీసీ కాలనీ, పోలీసు కాలనీల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలు ప్రాంతాల్లో సైడ్ డ్రైయిన్లు కావడంతో వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

కమిషనర్ కీర్తి చేకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ఎన్నికల ముసాయిదా అనంతరం చేపట్టిన పరిశీలన, జాబితా తయారీలో నిర్లక్ష్యంగా ఉన్న బూత్ లెవల్ అధికారులు , ఎన్నికల సూపర్‌వైజరీ అధికారులపై చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌ఓ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. రెవెన్యూ కల్యాణ మండపంలో శుక్రవారం పశ్చిమ నియోజకవర్గ బీఎల్‌ఓలు, సూపర్‌వైజరీ అధికారులతో ఎన్నికల ఓటర్ల తుది జాబితాపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో నిర్లిప్తత, నిర్లక్ష్యం వద్దని తెలిపారు.ముసాయిదాలో వచ్చిన తప్పులు తుది జాబితాలో కూడా వచ్చి ఉంటే సంబంధిత బీఎల్‌ఓలపై చర్యలు తీసుకోవాలని ఏఈఆర్‌ఓలను ఆదేశించారు. రెండు రోజుల్లో తుది జాబితాపై బీఎల్‌ఓల వారీగా సూపర్‌వైజరీ అధికారులు, ఏఈఆర్‌ఓలు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనధికారికంగా సెలవులు తీసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సంబంధిత బీఎల్‌ఓతో కలిసి సూపర్‌వైజరీ అధికారులు పరిశీలించాలని చెప్పారు. వృద్ధులు, దివ్యాంగులకు వీలుగా ర్యాంప్‌లు, టాయిలెట్స్ ఉండేలా మౌలిక వసతులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌ఓ, అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివజ్యోతి, ఏఆర్‌ఓ ఇందిరాదేవి, ఏఈఆర్‌ఓలు సీహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ప్రదీప్ కుమార్, సూపరింటెండెంట్లు ప్రసాద్, సాంబశివరావు, పద్మ, డెప్యూటీ తహసీల్దార్లు బి.భాస్కర్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

బాధితులకు సెల్‌ఫోన్లు అందజేత



సెల్‌ఫోన్ అందిజేస్తున్న ఏఎస్పీ సుప్రజ

పట్నంబజారు: జిల్లాలోని పలు స్టేషన్ల పరిధిలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు పోలీసులు రికవరీ చేసి అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం అడ్మిన్ అడిషనల్ ఎస్పీ కె.సుప్రజ వాటిని బాధితులకు అప్పగించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సెల్‌ఫోన్ రికవరీల్లో భాగంగా రూ. 43.26 లక్షల విలువ చేసే 144 వివిధ బ్రాండ్ ఫోన్లు అందజేసినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు రూ. 2.50 కోట్లు విలువ చేసే ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు వెల్లడించారు. ఫోన్ల రికవరీలో ఐటీ కోర్ సిబ్బంది, అధికారుల పనితీరు అభినందనీయమన్నారు. సెల్‌పోన్లు పోగొట్టుకున్న బాధితులు 8688831574కు సమాచారం అందించి, దరఖాస్తు సేవలు వినియోగించుకోవడం ద్వారా ఎఫ్‌ఐఆర్ లేకుండా సెల్‌ఫోను రికవరి చేస్తామని చెప్పారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారంతా సీఈఐఆర్ సిటిజన్ పోర్టల్ ద్వారా సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఇప్పటివరకు తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, వెస్ట్ బెంగాల్‌తోపాటు ఇతర రాష్ట్రాల్లో ఫోన్లు పోగొట్టుకున్న వారికి తిరిగి అందజేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఐటీ కోర్ అధికారులు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ రాబడికి గండి?

- ఆశీలు వసూలులో నిర్లక్ష్యం వహించిన రెవిన్యూ అధికారులపై కమిషనర్ సీరియస్
- నలుగురు డెప్యూటీ కమిషనర్లు, ముగ్గురు ఆర్వోలు, ఐదుగురు ఆర్‌ఐలకు షోకాజ్ నోటీసులు జారీ
- నగరపాలక సంస్థకు రూ.2 కోట్లు వరకు ఆర్థిక నష్టం



నెహ్రూనగర్: ఆశీల వసూళ్లలో నిర్లక్ష్యం కనబరిస్తే చర్యలు తప్పవని, జీఎంసీ ఆదాయానికి గండి కొడితే ఉపేక్షించబోమని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ 2023–24కి సంబంధించి నిర్వహించిన ఆశీల వసూళ్ల టెండర్లలో మునుపటి ఏడాది కన్నా తక్కువ మొత్తంలో కోట్ కావడంతో నగరపాలక సంస్థ ఆదాయానికి నష్టం వాటిల్లకుండా డిపార్ట్‌మెంట్ వసూళ్లు చేయాలని రెవిన్యూ అధికారుల్ని ఆదేశించారు. ఆసీలు వసూళ్లలో నిర్లక్ష్యం కనబరిచిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ అధికారులు, డెప్యూటీ కమిషనర్లకు శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

ఆశీసు వసూలు చేసే ప్రాంతాలు ఇవి..

నగరపాలక సంస్థ పరిధిలోని కొల్లిశారద మార్కెట్, పీవీకే నాయుడు మార్కెట్, కన్యాకాపరమేశ్వరి గుడి దగ్గర మార్కెట్, అరండల్ పేట గడ్డి మార్కెట్లు, పీవీకే నాయుడు మార్కెట్ సైకిల్ స్టాండ్, వెన్ లాక్ మార్కెట్ స్టాండ్లు, మరుగుదొడ్లకు సంబంధించి విజ్ఞాన మందిరం ఎదురు, నాజ్ సెంటర్, గాంధీ పార్క్, బండ్ల బజార్, తాలుకా ఆఫీస్ వద్ద, కృష్ణా పిక్చర్ ప్యాలెస్, బస్టాండ్, కొల్లి శారదా మార్కెట్‌ల వద్ద ఉన్న మరుగుదొడ్ల నుంచి ఆశీలు వసూళ్లు నిర్దేశిత లక్ష్యం మేరకు జరగలేదు. సిబ్బంది నిర్లక్ష్యంపై తొలుత కమిషనర్ మౌఖిక ఉత్తర్వులు జారీ చేశారు.అనంతరం జరిగిన రెవెన్యూ విభాగ సమావేశంలో చర్చకు రావడంతో వెంటనే ఆర్‌ఐ, ఆర్‌ఓలకు షోకాజ్, డెప్యూటీ కమిషనర్లకు నోటీసులు జారీ చేశారు.

ప్రైవేటు వ్యక్తుల జేబుల్లోకి కార్పొరేషన్ ఆదాయం

డిపార్ట్‌మెంట్ కలెక్షన్స్ చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ వాటిని పక్కన పెట్టి మరి ఆశీలు వసూలు బాధ్యతను రెవిన్యూ అధికారులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టారు. వీరంతా చేతివాటం ప్రదర్శిస్తూ కార్పొరేషన్‌కు నగదును సక్రమంగా జమ చేయలేదు. దీనివల్ల రూ.2 కోట్లు దాకా నష్టం వాటిల్లినట్లు కార్పొరేషన్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

12 మందికి నోటీసులు జారీ

గుంటూరు నగరపాలక సంస్థ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 12 మంది రెవెన్యూ అధికారులకు కమిషనర్ నోటీసులు జారీ చేశారు. ఆశీలు వసూలు విషయంలో ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాల్ని అధిగమించాలని పలు సమావేశాల్లో ఆదేశించినప్పటికీ, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన డెప్యూటీ కమిషనర్లు సీహెచ్. శ్రీనివాస్, బి. శ్రీనివాసరావు, టి. వెంకటకృష్ణయ్య, డి. రవీంద్ర, ఆర్వోలు కె. సాంబశివరావు, బాలాజీ బాషా, ఎం. రెహ్మాన్, ఆర్‌ఐలు కె. రాజేంద్రప్రసాద్, ఏ. శ్రీనివాసరావు, షేక్ సలాం, హయత్వా వలి, కరీముల్లా ఖాన్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

ఆరోగ్య సమాజమే లక్ష్యంగా పరిశోధనలు



పరిశోధన పత్రాల సావనీర్ ఆవిష్కరిస్తున్న వీసీ, యూనివర్సిటీ అధికారులు, అతిథులు

- వీసీ ఆచార్య పి. రాజశేఖర్
- జువాలజీ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు ప్రారంభం

ఏఎన్‌యూ: ఆరోగ్యవంతమైన సమాజాన్ని రూపొందించడమే లక్ష్యంగా విస్తృతమైన పరిశోధనలు జరగాలని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సైన్స్ కళాశాల జువాలజీ, ఆక్వా కల్చర్ విభాగం సంయుక్తంగా 'ఇమ్యునాలజీ– బయోడైవర్సిటీ –ఆక్వా కల్చర్ అండ్ ఆక్వాటిక్ టాక్సికాలజీ' అనే అంశంపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సును శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రోజురోజుకూ కొత్త కొత్త రుగ్మతలతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటికి శాశ్వత పరిష్కారం చూపే పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు రావాలని తెలిపారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య కె. సునీత నివేదికను సమర్పించారు. రెండు రోజులపాటు జరిగే సదస్సులో 10 చర్చలు, 80 మౌఖిక, పోస్టర్ ప్రదర్శనలు, పరిశోధన ఫలితాలకు సంబంధించిన అంశాల సమర్పణ ఉంటుందని తెలిపారు. దేశ వ్యాప్తంగా 300 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలిపారు. విద్యావేత్తలు, పరిశ్రమ, వైద్య రంగాలను మిళితం చేసే పరిశోధన పత్రాలు, నైపుణ్యాలపై చర్చ ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నారై కళాశాల పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ ఆర్. రామకృష్ణ, ఐసీఏఆర్ ప్రతినిధి డాక్టర్ ఆర్ రాథోడ్, భారతీదాసన్ వర్సిటీ అధ్యాపకులు ప్రొఫెసర్ సంతానం, ప్రొఫెసర్ రాజారాం , విజ్ఞాన్ యూనివర్సిటీ అధ్యాపకులు డాక్టర్ ఎన్.ఎస్. సంపత్ కుమార్, డాక్టర్ సీహెచ్. అంజనాదేవి, విశాఖపట్నం సీసీబీఎస్ ప్రతినిధి డాక్టర్ జాన్ డాగ్లస్ పల్లేటి, సీడీసీ డీన్ ఆచార్య కె. మధుబాబు, అధ్యాపకులు ప్రొఫెసర్ పద్మావతి, ప్రొఫెసర్ వీరయ్య, ప్రొఫెసర్ సింహాచలం, ప్రొఫెసర్ వెంకటరత్నమ్మ, డాక్టర్ గోపాలరావు, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వర్లు, కుసుమకుమారి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉద్యోగుల హక్కు, సామాజిక భద్రత కల్పించే పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్‌ను విడుదల చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్పొరేట్లు, షేర్ మార్కెట్‌లకు లాభాలను చేకూర్చే సీపీఎస్, జీపీఎస్‌ను పాలకవర్గాలు అమలు చేసేందుకు ప్రభుత్వాల ప్రయత్నాన్ని తప్పుపట్టారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజలతో పాటు ప్రభుత్వాలకు లాభాన్ని వచ్చే పాత పెన్షన్‌ను అమలు చేయాలని కోరారు. పాత పెన్షన్‌ను పునరిద్దరిస్తే ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్థమవుతుందని చెప్పే మేధావులు బహిరంగ చర్చకు రావాలని ఆయన కోరారు. కార్పొరేట్లకు లక్షలాది కోట్ల రాయితీలను ఇస్తున్న ప్రభుత్వాలు ఉద్యోగులకు ఇచ్చే పెన్షన్‌ను ఆర్థిక కోణంలో చూడటం తగదని తెలిపారు. రాజకీయ పార్టీలు ఓపీఎస్‌పై తమ వైఖరి వెల్లడించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏ.ఎస్. కుసుమకుమారి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. ఆదిలక్ష్మి, ఎం. కళాధర్, నాయకులు జి. వెంకటేశ్వర్లు, సీహెచ్. ఆదినారాయణ పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే సామాజిక అభివృద్ధి

నెహ్రూనగర్: ఐకమత్యంతోనే సామాజిక అభివృద్ధి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు తెలిపారు. పాత గుంటూరులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రజక సంఘాన్ని రజకులే కాపాడుకోవాలని, కొందరు వ్యక్తులు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడంపై ఆయన ఖండించారు. స్వార్థం కోసం సంఘాన్ని పావుగా వాడుకుంటూ అసత్య ప్రచారాలు సమంజసం కాదని తెలిపారు. రజకులంతా ఐక్యమై సామాజిక అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో సంఘ నాయకులు ఈమని ఉమామహేశ్వరరావు, నరసింహారావు, వీరవల్లి శ్రీనివాసరావు, గంధం గోపి, పూసపాటి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయ సిలంబం పోటీలకు జగ్విక్రృష్ణ ఎంపిక



గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయి సిలంబం (కర్రసాము) పోటీల్లో సత్తా చాటిన శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాల ఆరో తరగతి విద్యార్థిని ఎం. జగ్విక్రృష్ణ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు.లక్ష్మీపురంలోని పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీఆర్ స్టేడియంలో గతనెల 28న నిర్వహించిన 13వ సిలంబం (కర్రసాము) రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్–2024లో సింగిల్ స్టిక్, డబుల్ స్టిక్ విభాగాల్లో జగ్విక్రృష్ణ ప్రథమ బహుమతులు కైవసం చేసుకుందని తెలిపారు. అంతరించిపోతున్న కళగా కాకుండా ప్రతి ఆడపిల్ల ఆత్మరక్షణకు, మనో ధైర్యం, ఆత్మవిశ్వాసానికి ఇటువంటి క్రీడలు దోహదం చేస్తాయని చెప్పారు. ఈసందర్భంగా విద్యార్థినితో పాటు కోచ్‌లు వి. రామకృష్ణ, బి. కిరణ్ బాబును పాఠశాల కమిటీ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల సుబ్బారావు, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, సీనియర్ కో–ఆర్డినేటర్ దుర్గాశ్యామ్, ప్రీ–ప్రైమరీ కో–ఆర్డినేటర్ శ్రీదేవి అభినందించారు.

శ్రీ అంజలి హాస్పిటల్‌లో ఉచిత ఓపీ



వేడుకల్లో డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ నాగరాజు, డాక్టర్ భారతి

గుంటూరు మెడికల్: శ్రీ అంజలి హాస్పిటల్ మూడో వార్షికోత్సవ సందర్భంగా ఈనెల10 వరకు ఉచితంగా ఓపీ, వైద్య పరీక్షల్లో రాయితీ కల్పిస్తున్నట్లు ఊపిరితిత్తుల వ్యాధి నిపుణులు డాక్టర్ బి.దుర్గాప్రసాద్ తెలిపారు. స్థానిక గుంటూరువారి తోట 6వ లైనులోని శ్రీ అంజలి హార్ట్, లంగ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మూడో వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఊపిరితిత్తులకు సంబంధించిన అన్ని వ్యాధులకు నూతనంగా ప్రారంభించిన ఇంటర్‌వెన్షనల్, పల్మనాలజీ యూనిట్ ద్వారా ఆధునిక వైద్యం అందిస్తున్నామని డాక్టర్ బి.దుర్గాప్రసాద్ తెలిపారు. జనరల్ మెడిసిన్, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ బి.నాగరాజు మాట్లాడుతూ గుండె సంబంధిత వ్యాధులకు ఇన్సూరెన్స్, ఆరోగ్యశ్రీ, ద్వారా ఆధునిక వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. ఊపిరితిత్తులకు, గుండెకు సంబంధించిన మెట్రోపాలిటన్ నగరాల్లో అందించే ఆధునిక వైద్యం ఒకే చోట అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చామని పేర్కొన్నారు. జనరల్, లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ ఎం.ధీరజ్‌కుమార్ మాట్లాడుతూ అధునాతన పద్ధతిలో ఆపరేషన్లు చేస్తున్నామని తెలిపారు. ప్రసూతి, గైనకాలజీ నిపుణులు డాక్టర్ బి.భారతి మాట్లాడుతూ నూతన టెక్నాలజీతో వైద్య సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. వేడుకల్లో పలువురు ప్రముఖులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర సప్తాహ వైభోత్సవాలు



పారాయణం చేయిస్తున్న విజయేశ్వరి దేవి, బాలస్వామి

తెనాలి టౌన్: పట్టణంలోని తాలూకా హైస్కూల్ గ్రౌండ్‌లో శ్రీ విద్యాపీఠం, సాలీగ్రామ మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర సప్తాహ వైభోత్సవాలు శుక్రవారం ఐదో రోజుకు చేరాయి. శ్రీ గోవింద నామ జపయజ్ఞం పూర్ణాహుతిని వేద పండితులు నిర్వహించారు. శ్రీ విద్యాపీఠం నిర్వాహకులు బాలస్వామీజీ పర్యవేక్షణలో స్వామికి విశేష పూజలు జరిపారు. విశ్వశాంతి ఆశ్రమ ట్రస్ట్ పెనుశీల క్షేత్రం వ్యవస్థాపకురాలు శ్రీ విజయేశ్వరి దేవి 10వేల మంది భక్తులతో లలిత సహస్ర పారాయణం చేయించారు. డాక్టర్ అనంతలక్ష్మి వేంకటేశ్వరస్వామి వైభవాన్ని తెలియజేశారు. పూజ్యశ్రీ బాలస్వామీజీ మాట్లాడుతూ శనివారం వెంకటేశ్వర స్వామి పద్మావతి కల్యాణం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సాలీగ్రామ మఠ ట్రస్ట్ చైర్మన్ నంబూరి కృష్ణమూర్తి, సెక్రటరీ వుప్పల నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య, రామకృష్ణ, నాగేశ్వరరావు, గుడివాడ శివప్రసాద్, లోకనాథం, మఠం సభ్యులు, శ్రీ విద్యాపీఠం, విజయలక్ష్మి మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు. సుమారు 10వేల మందికి పైగా భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

పట్నంబజారు: ఆన్‌లైన్‌లో వ్యక్తిని మోసం చేసిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గణేశ్వరరావువీధికి చెందిన షేక్ మస్తాన్ టెలిగ్రామ్ యాప్ చూస్తున్న సమయంలో ఆన్‌లైన్ ట్రేడింగ్‌కు సంబంధించి వెబ్‌సైట్ ఓపెన్ చేశారు. అందులో వచ్చిన విధంగా కొద్దిపాటి డబ్బులు చెల్లించారు. తిరిగి యాప్ నిర్వాహకులు కొద్దిమొత్తంలో డబ్బులు ఇవ్వడంతో నమ్మిన మస్తాన్ దఫాల వారీగా రూ. 8.46 లక్షలు చెల్లించారు. సదరు వెబ్‌సైట్ నిర్వాహకుల నుంచి ఎలాంటి సమాధానం రాకపోగా, డబ్బులు తిరిగి చెల్లించకపోవడంతో మోసపోయానని గ్రహించారు. ఈ మేరకు షేక్ మస్తాన్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో నిత్య సహాయమాత మహోత్సవం



నిత్య సహాయమాత స్వరూపంతో ప్రదక్షిణ నిర్వహిస్తున్న ఫాదర్‌లు, గురువులు

తెనాలి టౌన్: పట్టణ చెంచుపేటలోని నిత్యసహాయ మాత(ఆర్‌సీఎం) చర్చి మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. నిత్యసహాయ మాత దేవాలయంలో ఉదయం దివ్యబలి పూజను జరిపారు. విజయనగరం విచారణ గురువులు మార్నేని లూర్దు పర్యవేక్షణలో నిత్యసహాయమాత స్వరూపంతో ప్రదక్షిణ చేశారు. వేడుకలు సందర్భంగా చర్చికి విద్యుత్ అలంకరణ చేశారు. సాయంత్రం ఆవరణలో సమిష్టి దివ్య బలిపూజను గురుశ్రీ రెవరెండ్ ఫాదర్ ఆంథోని విన్సెంట్ నిర్వహించారు. గుంటూరు మేత్రాసనం పరిధిలోని పలు విచారణకు చెందిన గురువులు, ఫాదర్లు పాల్గొన్నారు. దివ్యబలిపూజలో ఆంథోని విన్సెంట్ వాక్యోపదేశం అందించారు. యేసుక్రీస్తు బోధనల్ని ఆచరించాలని సూచించారు. నిత్యసహాయమాతను వేడుకున్నట్లయితే కోరిన కోర్కెలు నేరవేరుతాయని తెలిపారు. తెనాలి డివిజర్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన క్రైస్తవులు వేల సంఖ్యలో వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని గురుశ్రీ కోయ స్లీవ, గురుశ్రీ ఆంథోని విన్సెంట్, గురుశ్రీ విజయ్ కుమార్ పర్యవేక్షించారు. విచారణకు చెందిన కన్యా స్త్రీలు, ఉపదేశీలు, ఉత్సవ కమిటీ సభ్యులు ఉత్సవ ఏర్పాట్లకు సహకరించారు.

తాత్కాలిక బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు కోత

లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు కోత పెట్టారని విశ్లేషకులు ముప్పాళ్ల ఆర్. ప్రసాదరావు తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో బడ్జెట్‌పై శుక్రవారం ఏర్పాటు చేసిన చర్చలో ఆయన మాట్లాడారు. భావోద్వేగాలతో ప్రజలను ఆకర్షించగలుగుతున్నప్పుడు మినహాయింపులు,రాయితీలతో తమకు అవసరం లే దన్నట్లుగా ఒక ధీమాతో తీసుకొచ్చినట్లుగా బడ్జెట్ ఉందని తెలిపారు. ఎన్నికలు ఏడాదిలోనూ మోదీ ప్రభుత్వం కార్పొరేట్ల వైపే చూసిందని పేర్కొన్నారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విశ్లేషకులు పి.భావన్నారాయణ మాట్లాడుతూ గత ఏడాది కొనసాగించిన కార్పొరేట్ టాక్స్ రాయితీని ఈసారి కొనసాగించారని తెలిపారు. ఉపాధి హామీ చట్టంతో పాటు అణగారిన వర్గాలకు ఉద్దేశించిన ముఖ్యమైన పథకాలకు ఎడాపెడా కోత పెట్టడం సబబు కాదని తెలిపారు. ఆహారం, ఎరువులు, పంటల బీమా, గ్యాస్ వంటి పథకాలకు సబ్సిడీలు కుదించడంతో సామాన్యులపై భారం పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.